

## అయ్యప్ప స్వామి మందిరంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

కామారెడ్డి / జుక్కల్ నియోజకవర్గం ప్రతినిధి, డిసెంబర్ 13 కామారెడ్డి జిల్లా : జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వాముల ఆహ్వానం మేరకు అయ్యప్ప స్వామి మందిరంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీ కాంతారావు అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## దివ్యాంగుల గొంతుక మీరు కావాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అసెంబ్లీలో మాట్లాడేందుకు దివ్యాంగుల గొంతుక మీరు కావాలని కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ కోరారు. బుధవారం విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మార్యద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానం చేసి దివ్యాంగుల సంక్షేమ కోసం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో దివ్యాంగుల సమాజం కోసం ప్రశ్నించే గోంతుకగా మీరు కావాలని, రాష్ట్రంలో ఉండే దివ్యాంగుల సమాజం కోసం నిలబడాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగుల కోసం మేనిఫెస్టోలో 29 వ అంశంగా పేర్కొన్న 2016 వికలాంగుల చట్టం తెలంగాణలో పూర్తిస్థాయిలో అమలయలా చూస్తామని, దివ్యాంగుల నెలవారి పెన్షన్ 6000 లకు పెంచుతామన్నారు, ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో పటిష్టంగా అమలు చేస్తూ బ్యాక్ లగ్ పోస్టులను భర్తీ చేస్తాం, దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తామని ఆ 29వ అంశంలో పేర్కొన్నారని వాటిని అమలయ్యే విధంగా అసెంబ్లీలో మాట్లాడాలి అన్నారు. నేటి సమాజంలో ధినక, పేద, సకలాంగులు, దివ్యాంగులు 4 వర్గాలుగా గుర్తించాలని కోరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈనెలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఏర్పాటులో పాల్గొన్నారనీ, ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి కూడా మా దివ్యంగుల దినోత్సవం లో పాల్గొనలేదన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ పంగ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింలు, జిల్లా నాయకులు రంగ్యానాయక్, రాజమౌళి, పురం శంకర్, స్వామి, కొండల్ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో పెరిగిన చలి తీవ్రత

**మూడు రోజులపాటు స్వల్ప ఉష్ణోగ్రతలు**

**హెచ్చరించిన వాతావరణ శాఖ**

రాష్ట్రాన్ని చలిపులి గజగజలాడిస్తోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రానున్న మూడు రోజులకు వాతావరణ శాఖ యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఐదారు జిల్లాలు మినహా రాష్ట్రమంతా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతాయని వాతావరణ శాఖ తెలిపింది. సగటున 12-14 డిగ్రీల చొప్పున నమోదు అయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత బాగా పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. బుధవారం సంగారెడ్డి జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10.6, రంగారెడ్డి జిల్లాల్లో 10.9 డిగ్రీలుగా నమోదు అయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. మరో మూడు రోజుల పాటు రాష్ట్రమంతా చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుందని తెలిపింది. ఇక పగటిపూట ఉష్ణోగ్రతలు సైతం 26-28 డిగ్రీల మధ్య నమోదు అవుతాయని తెలిపింది.

## సీపీఎస్‌ను రద్దు చేయాలి

### సీఎంకు టీఎస్‌యూటీఎఫ్ నాయకుల వినతి

హైదరాబాద్, డిసెంబరు13 : ప్రభుత్వ విద్యారంగం బలోపేతం, ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు ప్రభుత్వం పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎసయూటీఎఫ్) నాయకులు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలో బుధవారం టీఎసయూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా సీపీఎస్‌ను రద్దు చేయాలని, పదోన్నతుల సంక్షోభాన్ని పరిష్కరించాలని, జీవో 317 బాధితులకు న్యాయం చేయడంతోపాటు వేతనాలు, బకాయిలు సకాలంలో చెల్లించాలని, ఉద్యోగుల సంయుక్త స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వినతులపై సీఎం సానుకూలంగా స్పందించారని సంఘం అధ్యక్షుడు కె.జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు.

# మద్నూర్ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్ల బీట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు





## రైతులకు ఎలాంటి మోసాలు జరగకూడదు వ్యాపారులు అధికారులు సహకరించాలి ఎమ్మెల్యే

కామారెడ్డి / జుక్కల్ నియోజకవర్గం ప్రతినిధి, డిసెంబర్ 13 ( వాయిస్ టుడే ) కామారెడ్డి జిల్లా : జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం లోని ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాలకు పూర్తిగా సరిహద్దులు గల మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పత్తి కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు గల మార్కెట్ ఈ మార్కెట్ పరిధిలో బుధవారం నాడు పత్తి కొనుగోళ్ల బిట్లను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ప్రారంభించారు. కొనుగోళ్ల బీట్లు ప్రారంభంతో పత్తికి మద్దతు ధర కంటే 100 రూపాయలు అధికంగా పలికింది. మద్దతు ధర పత్తి క్వింటాలుకు 7020 రూపాయలు ఉండగా పత్తి కొనుగోల్ల వీటిలో పత్తి ధర క్వింటాలుకు 7120 రూపాయలు పలికింది క్వింటాలుకు వంద రూపాయలు ధర పెరిగింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పత్తి పంట రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ... రైతులకు పత్తి అమ్మకాల్లో ఎలాంటి మోసాలు జరగకూడదని పత్తి కొనుగోలు వ్యాపారులు సక్రమంగా కొనుగోలు జరుపుతూ సహకరించాలని అధికారులు కూడా పత్తి కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సాదిస్తూ సహకరించాలని సూచించారు. పత్తి కొనుగోళ్ల బిట్ల ప్రారంభోత్సవంలో ఇటీవల మద్నూర్ మార్కెట్ కమిటీకి పత్రిక పరంగా రాజీనామా చేసిన చైర్మన్ సంగమేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు మార్కెట్ కమిటీ సెక్రటరీ విట్టల్, మార్కెట్ కమిటీ సూపర్వైజర్ సత్యం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మద్దతు ధర కొనుగోలు అధికారి రెడ్డి, అధికార పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి సభ్యులు జి సాహెబ్ రావు, జుక్కల్ జెడ్పిటిసి కుటుంబ సభ్యులు దాదారావు పటేల్, షక్కర్గ రామ్ పటేల్, హనుమాన్ స్వామి, పప్పు సెట్, తమ్మేవార్ భగవాన్ సెట్, మేనూర్ గ్రామ సర్పంచ్ విట్టల్ గురూజీ, గ్రామ సర్పంచ్ సంతోష్ పటేల్, మండలంలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పత్తి కొనుగోలు వ్యాపారులు కమిషన్ ఏజెంట్లు మార్కెట్ కమిటీ సిబ్బంది పత్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీల అమలుకు ప్రజలపక్షాన పోరాడుతాం: హరీశ్‌రావు

**బీఆర్ఎస్‌కు ఒడిదొడుకులు సహజమే**

**అధికారం కోల్పోవడం స్పీడ్‌బ్రేకర్ మాత్రమే**

**పార్లమెంట్‌లోకి అగంతకుల చొరబాటు భద్రత వైఫల్యానికి నిదర్శనం**

**నర్సాపూర్ కృతజ్ఞతాసభలో హరీశ్‌రావు**



నర్సాపూర్, డిసెంబర్13: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. గెలుపు ఓటములు సహజమని.. కష్టపడుతూ ముందుకు సాగాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి ఒడిదొడుకులు సహజమని, గతంలో ఓడి గెలిచామని పేర్కొన్నారు. విజయం పొందినప్పుడు విర్రవీగలేదని, ఓడినప్పుడు కుంగిపోలేదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు నిజాన్ని గ్రహిస్తారని, పనిమంతులెవరో తేలుస్తారని చెప్పారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ కృతజ్ఞతాసభలో హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పనితనం తప్ప పగతనం తెలియని వ్యక్తి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని చెప్పారు. సాధించిన తెలంగాణ కక్షలతో, పగలతో ఇబ్బంది పడొద్దని పనిమీద కేసీఆర్ దృష్టిపెట్టారని గుర్తు చేశారు. అధికారం కోల్పోవడం స్పీడ్ బ్రేక్ మాత్రమేనని, అంతిమంగా గమ్యం చేరేది బీఆర్ఎస్ పార్టేనని తెలిపారు. అధికార పార్టీ నాయకులు మానసికంగా దెబ్బతీయడానికి ఎన్నో కుయుక్తులు పన్నుతారని, ఇబ్బందులకు గురిచేస్తారని, ధైర్యం కోల్పోవద్దని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు.

### లోక్‌సభలోకి అగంతకులు దూరడం దురదృష్టకరం

లోక్‌సభలోకి అగంతకులు దూరి కలర్ గ్యాస్‌ను చల్లడం దురదృష్టకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్లమెంట్‌కు రక్షణ లేకపోవడం బాధాకరమని, అదృష్టం బాగుండి ఎంపీలకు ఎలాంటి ప్రాణహాని జరగలేదని అన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపించి భద్రత కట్టుదిట్టం చేయాలని కోరారు. పార్లమెంట్‌కే రక్షణ లేకుండా ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, గాలి అనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపి, కౌన్సిలర్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిల్లులను పబ్లిక్ డొమైన్‌లో ఉంచండి

**బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి**



హైదరాబాద్, డిసెంబర్13: ప్రభుత్వం చేస్తున్న చట్టాలను కచ్చితంగా పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. అనవసరమైన, వాడుకలో లేని 76 చట్టాలను రద్దు చేసే బిల్లుపై రాజ్యసభలో బుధవారం చర్చ కొనసాగింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. బిల్లుపై చర్చలో బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడారు. కాలం చెల్లిన బిల్లుల రద్దును స్వాగతించారు. చైతన్యం అంటే కాలం చెల్లిన చట్టాలను తొలగించడమే కాదని, సాధారణ ప్రజలకు మేలు చేసే చట్టాలను తీసుకొచ్చి వాటికి సరైన మార్గదర్శకాలను రూపొందించడమన్నారు.

## రిజర్వేషన్లు పెంచాకే నియామకాలు చేపట్టాలి

**ఉచిత బస్సు పేద మహిళలకే ఉండాలి**

**రైతుబంధు సాయం పేద రైతులకే ఇవ్వాలి**

**విస్మరిస్తే అన్ని రూపాల్లో ఉద్యమిస్తాం**

**ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ**

ఖైరతాబాద్, డిసెంబర్ 13: 'రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ చేవెళ్ల డిక్లరేషన్‌ను తూచా తప్పకుండా అమలు చేయాలి. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే డీఎస్సీతోపాటు అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి' అని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొలి క్యాబినెట్‌లో మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పారని, ప్రస్తుతం ఆ ప్రయత్నాన్ని విరమించుకోవడంతోపాటు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని సూచించారు. ఆర్నెల్ల కాలంలో రిజర్వేషన్ల ప్రక్రియ చక్కదిద్దాలని, ఎస్సీలకు 15 నుంచి 18 శాతానికి, ఎస్టీ, మైనార్టీలకు 12 శాతం, బీసీల కులగణన చేపట్టి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచి డీఎస్సీ, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక భారం లేని, బడ్జెట్‌తో పనిలేని రిజర్వేషన్ల పెంపు వంటి హామీలను నెరవేర్చాలని సూచించారు. రాష్ట్ర క్యాబినెట్‌లో 7 శాతం జనాభా ఉన్న కులాలకే అధిక పదవులు ఇచ్చి 80 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రం ఐదు పదవులే ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్‌కు 70 నుంచి 80 శాతం మంది ముస్లింలు ఓట్లు వేశారని, కానీ, వారికి ఇంత వరకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించలేదని చెప్పారు.

# నేడే తలసేమియా చిన్నారుల మెగా రక్తదాన శిబిరం

**- కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) కామారెడ్డి జిల్లా కేంద్రంలో తల సేమియా చిన్నారుల కోసం కర్షక్ బి.ఎడ్ కళాశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 02 గంటల వరకు నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా తన కార్యాలయంలో ఆవిష్కరించరు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబు,ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు లు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ప్రతి 15 నుండి 20 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉంటుందని, అలాంటి చిన్నారులకు రక్తం దొరకకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని వారి ప్రాణాలను కాపాడడం కోసం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరానికి రక్తదాతలు తరలిరావాలని అన్నారు. ఒక రక్తదాత ఇచ్చే రక్తంతో ఒక చిన్నారి ప్రాణాలను 15 రోజులపాటు కాపాడవచ్చునని రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్,ఉపాధ్యక్షులు జమీల్ హైమద్,డాక్టర్ పుట్ల అనిల్,కిరణ్,రమణ,ఏర్రం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

